క్లుప్తంగా

అట్టముక్కలతో అయోధ్య ఆలయం



ఉండవెల్లి : మండలంలోని పుల్లూరు గ్రామానికి చెందిన చిన్నారులు అట్టముక్కలతో అయోధ్య రామ మందిర నిర్మాణాన్ని ఏర్పాటు చేశారు. ఓ ప్రైవేటు స్కూల్లో పలు రకాల నిర్మాణాలు ఏర్పాటు చేయడంతో అందులో పుల్లూరుకు చెందిన లహరి, అర్జున్‌లు కలిసి ఆలయాన్ని అద్భుతంగా ఏర్పాటు చేయడంతో పలువురు అభినందించారు.

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



అయిజ: మార్గశిర మాసాన్ని పురస్కరించుకుని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక అయిజ కమిటీ సభ్యులు మంగళవారం మండలంలోని వేణిసోంపురంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం– ప్రబోధ కమిటీ సభ్యులు నరేష్, భాస్కరాచారి, వేరేష్, విజయ్, దేవేంద్ర, శారద, భారతి, అక్షయ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

హనుమంతునికి సింధూర పూజ



రాజోళి: మండల కేంద్రం రాజోళిలో కొలువైన అంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంజనేయ స్వామికి ఆకుపూజ, సింధూర పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో భక్తులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



గద్వాల(కేటీదొడ్డి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో మండలంలోని రెండు మూడు రోజుల నుంచి మబ్బులతో కూడిన వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఏఈఓ ప్రీతిసుధ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రాల్లో ధాన్యం తడవకుండా ఉండేందుకు టార్పాలిన్ కవర్లను ధాన్యంపై కప్పి ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ రాష్ట్రపతికి ఘన నివాళి



శాంతినగర్ : మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి వేడుకలు వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్ గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన శ్రీకాంతాచారికి ఘనంగా నివాళులర్పించారు. శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాల వేసి జేజేలు పలికారు.

దాడి చేసిన వ్యక్తులను శిక్షించాలి

ఉండవెల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణకు మంగళవారం బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటిక్యాల మండల తహసీల్దార్‌పై దాడికి ప్రయత్నించి కులం పేరుతో దూషించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఆన్‌లైన్‌లో సర్వే సమాచారం

- 6969 కుటుంబాల వివరాలు నమోదు
- 80 శాతం ఆన్‌లైన్ పూర్తి

ఉండవెల్లి : సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ, కుల సమగ్ర కుటుంబ సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. ఉండవెల్లి మండలంలో ఇప్పటివరకు 6,969 కుటుంబాల వివరాల నమోదు పూర్తి చేశారు. గత నెల 9 నుంచి ఉండవెల్లి గ్రామంలో పంచాయతీ సిబ్బంది, ఉపాధ్యాయులు సర్వే చేయగా మండంలోని మిగిలిన 15 గ్రామాల్లో ఎన్యుమరేటర్లు, పంచాయతీ సిబ్బంది వివరాలు సేకరించారు. మొత్తం 8,646 కుటుంబాల వివరాలు సేకరించి గత నెల 23వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ ప్రారంభించారు. ఎంపీడీఓ కార్యాలయంతో పాటు గ్రామ పంచాయతీల్లో ఆన్‌లైన్ నమోదు చేపట్టారు. మొత్తం 50 మంది ఆపరేటర్లను నియమించారు. ఇప్పటి వరకు 80 శాతం నమోదు పూర్తయింది. మంగళవారంతో 100 శాతం నమోదు పూర్తవనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

మండలంలో 8646 కుటుంబాలు..

మండలంలో పంచాయతీ సిబ్బంది, ఎంపీడీఓ సిబ్బంది, సర్వే చేసి మొత్తం 8646 కుటుంబాలు గుర్తించారు. ఆయా కుటుంబాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు 50 మంది ఆపరేటర్లను నియమించారు. ఇప్పటివరకు ఉండవెల్లిలో గ్రామంలో 1200 పైగా కుటుంబాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.



ఉండవెల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు

మరో రెండు రోజుల్లో వివరాల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. మాదాసి కుర్వల కుటుంబాలను నమోదు చేయడానికి కలెక్టర్ నుంచి ఆర్డర్ రావడంతో సర్వే పూర్తి చేస్తున్నారు.

సందేహాలు నివృత్తి చేసుకుంటూ..

ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను ఆపరేటర్లు వేగంగా పూర్తి చేశారు. సర్వే సమాచారంలో ఏదైన సందేహాలుంటే సర్వే నిర్వహించిన ఎన్యుమరేటర్లను అడిగి తెలుసుకుంటున్నారు. ఆయా కుటుంబాల్లో ఇద్దరు, ముగ్గురు సభ్యులుంటే వివరాల నమోదుకు 15 నిమిషాలు, ఐదారుగురు ఉంటే 20 నిమిషాల సమయం పడుతుందని ఆపరేటర్లు తెలిపారు. కొందరు ఎన్యుమరేటర్లు పూర్తి సమాచారం నమోదు చేయకపోతే అధికారులు సంబందిత ఎన్యుమరేటర్లతో పూర్తి చేయించారు.

చివరిదశకు నమోదు ప్రక్రియ..

సమగ్ర కుటుంబ సర్వే సమాచారం వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. 50 మంది ఆపరేటర్ల ద్వారా ఎలాంటి తప్పులు లేకుండా వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయించి త్వరలో పూర్తి చేస్తాం.

– తిరుపతన్న, ఎంపీడీఓ, ఉండవెల్లి



ఉండవెల్లిలో సర్వేలో పాల్గొన్న సూపర్‌వైజర్, ఎన్యుమరేటర్లు(ఫైల్)

ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు



వడ్డేపల్లిలో పొదుపు సంఘం మహిళలకు చెక్కు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



అమరవాయిలో ప్రజాపాలనపై కళాజాతా ప్రదర్శన నిర్వహిస్తున్న సభ్యులు

శాంతినగర్ : వడ్డేపల్లి పురపాలక పరిధిలో ప్రజాపాలన విజయోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అర్బన్ డే వేడుకల్లో భాగంగా పట్టణ పరిధిలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి రవీంద్ర ఉన్నత పాఠశాల వరకు 2కే రన్‌ను కళాశాలల విద్యార్థులతో కలిసి నిర్వహించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రకృతి వనాల ఆవరణలో శుభ్రత చర్యలు చేపట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు పొదుపు సంఘ మహిళలు, కార్యాలయ సిబ్బందితో కలిసి ర్యాలీ చేపట్టారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణ పరిధిలోని ఎస్‌హెచ్‌జీ సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరైన రూ.94 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఉత్తమ పారిశుద్ధ్య సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ రాజయ్య, కౌన్సిలర్లు సుజాత, దేవమ్మ, కో ఆప్షన్ సభ్యులు ఖాజా మొహినుద్దీన్, నాయకులు దేవేంద్ర, ప్రజా ప్రతినిధులు, పొదుపు సంఘాల మహిళలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమరవాయిలో కళాజాతా..

గద్వాల(మల్దకల్) : రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రజా పాలన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కళాజాతా బృందం సభ్యులు మంగళవారం మండలంలోని అమరవాయి కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ ప్రభుత్వ పథకాలను తమ గ్రామీణ ప్రజలకు ఆటపాటల ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు రాహుల్, భూపతి, రమదేవి, కృష్ణ, స్వామి, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

అయిజలో విజయోత్సవ ర్యాలీ..

అయిజ: ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తయిన సందర్భంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయం నుంచి కొత్త బస్టాండ్ వరకు మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రజా పాలన విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 11వ వార్డులో వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మితో కలిసి రూ. 5 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం మున్సిపల్ సిబ్బందికి హెల్త్ కిట్లు, గ్లౌజులు, రేడియం జాకెట్లు, మాస్కులు అందజేశారు. పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయం నుంచి కొత్త బస్టాండ్ వరకు 2కే రన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కరాటే విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాలకులు మారినా విధానం మారలేదు

అయిజ: పాలకులు మారినా పాలనా విధానం మారలేదని బీజేపీ పట్టణ కార్యదర్శి భగత్ రెడ్డి అన్నారు. బీజేపీ ప్రజా చైతన్యం కార్యక్రమంలో భాగంగా మంగళవారం అయిజ నుంచి శాంతినగర్ వరకు బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పాలనను ఆరు గ్యారెంటీల అమలు తీరు నిరూపించిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని విజయోత్సవాలు జరుపుకుంటున్నారని ప్రశ్నించారు. జరుపుకోవాల్సింది విజయోత్సవాలు కాదని, విఫలోత్సవాలన్నారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ప్రదీప్ కుమార్, భీమసేన రావు, గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీకి తరలిన నాయకులు..

ఎర్రవల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు చెప్పిన 66 మోసాలకు నిరసనగా



అయిజలో బైక్ ర్యాలీ చేపట్టిన బీజేపీ నాయకులు

బీజేపీ ఆధ్వర్యంలో శాంతినగర్‌లో నిర్వహించిన బైక్ ర్యాలీకి మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు మంగళవారం అధిక సంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి మహేష్, పరుశరామ్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్యాంటీన్ ఏర్పాటు చేయాలి



అలంపూర్ : కోర్టు ఆవరణలో క్యాంటీన్ ఏర్పాటు చేయాలని న్యాయవాదులు జిల్లా జడ్జిని కోరారు. జిల్లా కేంద్రంలోని కోర్టులో అలంపూర్ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సురేష్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా జడ్జి కుశకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. న్యాయవాదులు, కక్షిదారులు, సాక్షులు, సాధారణ వ్యక్తులు స్థానికంగా ఆహారం లభించక ఇబ్బందులు పడుతున్నట్లు జడ్జికి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాసులు, యాకోబు, నాగయ్య, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

అలంపూర్ : కానిస్టేబుల్ నాగమణిని దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ వ్యవసాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. అలంపూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న రాజ్యాంగ నిర్మాత బాబసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ అధ్వర్యంలో ప్రతి ఘటన అనే పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ...కులాంతర వివాహం చేసుకున్నదనే అక్కస్సుతోనే కానిస్టేబుల్ నాగమణిని తన సోదరుడు హత్యకు పాల్పడ్డాడని ఆరోపించారు. గత నెల 10న యాదగిరిగుట్టలో శ్రీకాంత్ అనే దళిత యువకుడిని కులాంతర వివాహం చేసుకున్న కారణంగా ఆగ్రహం తట్టుకోలేక అత్యంత దారుణంగా హత్య



అలంపూర్‌లో ప్రతిఘటన పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చేశాడన్నారు. కులాంతర వివాహితుల సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు వెంకటస్వామి, నాగరాజు, అయ్యప్ప, రైతు సంఘం నాయకులు నరసింహ, ఖలీల్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మల్లేష్ మృతి తీరని లోటు



గద్వాల : సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల మల్లేష్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మల్లేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల ప్రజల సమస్యల కోసం, సీపీఐ పార్టీ కోసం ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆశన్న, మస్తాన్, పరమేష్, రైతు సంఘం నాయకులు గోపాల్ రావ్, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ప్రవీణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాటం

గద్వాల(మల్దకల్) : దివ్యాంగులు, మానవ హక్కుల కోసం పోరాడతామని తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ సంఘం నాయకుడు నర్సింహులు అన్నారు. అదే విధంగా మంగళవారం మండలంలోని విఠలాపురం గ్రామంలో క్రిమిసంహారక మందుల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. క్రిమీ సంహారక మందులు వాడటం వలన కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. అధిక మోతాదులో రసాయనిక ఎరువులు, పంటలపై డ్రోన్ల ద్వారా పిచికారీ చేయడం వలన పంట పొలాలతో పాటు కూలీలు అనారోగ్య బారిన పడే అవకాశముందన్నారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, రాముడు, తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.



క్రిమిసంహారక మందుల వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తున్న సంఘ సభ్యులు

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు



శాంతినగర్ : వడ్డేపల్లి మండల పరిధిలోని తిమ్మాజిపల్లి గ్రామంలో కార్తీక దామోదరుని ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కబడ్డీ పోటీలు ఉల్లాసంగా సాగాయి. కార్తీకమాసం ముగింపు ఉత్సవాల్లో భాగంగా అంతర్‌రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన కబడ్డీ పోటీలను వడ్డేపల్లి కౌన్సిలర్ అజయ్‌కుమార్ టాస్‌వేసి ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్య నీరుగార్చే యత్నం

గద్వాల(మల్దకల్) : కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు యూనివర్సిటీలకు కొమ్ముకాస్తూ ప్రభుత్వ విద్యను నీరు గార్చే ప్రయత్నం చేస్తుందని యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహసభల వాల్ పోస్టర్‌ను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర కేంద్ర, ప్రభుత్వాలు విద్యార్థులకు విద్యను అందించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న ప్రభుత్వాలు తమ తీరును మార్చుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో యుఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రాము, నరేష్, గోపాల్, మనీషా, స్పందన, విమోచన తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయం ఎదుట మంగళవారం సమగ్ర శిక్ష ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఎమ్‌ఐఎస్, సీఆర్‌పీ, పీటీఐ, ఐఈఆర్‌పీ, సీసీఓ, మెసెంజర్స్ కేజీబీవీ ఉద్యోగులను రెగ్యులరైజేషన్ కోసం కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం సమ్మె చేపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, సంఘం నాయకులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలి

అయిజ: ప్రభుత్వం హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని బీఆర్‌ఎస్వీ నాయకుడు, గురుకుల బాట జిల్లా ఇన్‌చార్జి పల్లయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ హాస్టళ్లను పల్లయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రభుత్వం బూట్లు, చలికోట్లు, స్పోర్ట్స్, బ్యాగ్స్ ఇవ్వలేదని, కనీసం ప్లేట్లు, గ్లాసులు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నాయకులు రాజు, రవి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



బాత్రూమ్‌లను పరిశీలిస్తున్న పల్లయ్య

అధికారులకు రక్షణ కరువు



ఎర్రవల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఎస్పీ నాయకులు



అయిజలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఎస్పీ నాయకులు

ఎర్రవల్లి: ప్రజాపాలనలో దళిత అధికారులకు రక్షణ కరువైందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. ఇటీవల ఇటిక్యాల తహసీల్దార్‌పై దాడి చేసిన నిందితులను తక్షణమే రిమాండ్ చేయాలని మంగళవారం స్థానిక తహసీల్దార్ నరేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలను ప్రభుత్వం నీరుగార్చుతుందని మండిపడ్డారు. ఒక వైపు దళితులకు అండగా ఉంటామని ప్రభుత్వం నేడు దళిత తహసీల్దార్‌పై దాడి జరిగినా ఎందుకు పట్టించుకోవడం లేదని విమర్శించారు. తక్షణమే తహసీల్దార్‌పై దాడి చేసి కులం పేరుతో దూషించిన నిందితులను రిమాండ్ చేయాలని లేని పక్షంలో బీఎస్పీ ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యాచరణ కఠినంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కఠిన నిబంధనలు అమలు చేయాలి..

అయిజ: కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారులకు రక్షణ లేదని, ప్రభుత్వం కఠిన నిబంధనలు అమలు చేసి అధికారులకు రక్షణ కల్పించాలని బీఎస్పీ అలంపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు శశివర్మ, తేజ, కోశాధికారి రాజారత్నం కోరారు. మంగళవారం తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. అధికారులపై దాడులు చేసిన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఇటిక్యాల/ఎర్రవల్లి : మండల పరిధిలోని మునుగాల, ఎర్రవల్లి మండలం యాక్తాపురం గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పీఏసీఎస్ అధ్యక్షుడు రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా డీసీసీబీ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి హాజరవనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

అయిజ: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సబ్ యార్డ్‌లో సంతోషిమాతా మెప్మా ఐకేపీ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం అలంపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డెన్న, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాసులు వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జనార్దన్, రైతు సంఘం మండలాధ్యక్షుడు మేకల నాగిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దిలేటి, ఆర్.శ్రీధర్, జయరాములు, శేక్షావలి ఆచారి, రాణి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

మానవపాడు: మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులతో మంగళవారం టీఎస్ యూటీఎఫ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 60 మంది సభ్యత్వ తీసుకున్నట్లు తెలిపారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను పుణరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు మౌలాలి, వెంకటేష్, ఆనందం, నాగరాజు, బీసన్న, మల్లన్న, నరసింహ, మానవపాడు కార్యదర్శి వెంకటస్వామి, అయిజ మండల యూటీఎఫ్ అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మానవపాడులో సభ్యత్వం నమోదు చేస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

టీపీసీసీ అధ్యక్షుడిని సన్మానించిన నాయకులు

ఎర్రవల్లి: మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్‌ను మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. అలంపూర్ జోగుళాంబ ఆలయ దర్శనానికి వెళ్తుండగా ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి, వెంకటేష్ యాదవ్, రుక్మాందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

2 కేజీల సీహెచ్ పట్టివేత

గద్వాల(కేటీదొడ్డి): మండలంలోని నందిన్నె గ్రామంలో నిల్వ ఉంచిన 2 కేజీల సీహెచ్‌ను మంగళవారం గద్వాల అబ్కారీ శాఖ పోలీసులు పట్టుకున్నారు. అక్రమంగా నిల్వ ఉంచిన తలారి బోలప్ప అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

డీసీసీబీ గోల్డ్‌లోన్ మేళా

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో బుధవారం నుంచి బంగారు ఆభరణాలపై రుణాలు ఇవ్వనున్నట్లు డీసీసీబీ డైరెక్టర్ రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, వ్యాపారులు ఇట్టి అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.